# వాల్‌పోస్టర్ -1

ఉదయం ఎండి వాడి మొహం మీద వేడిగా పడింది. నులక మంచం మీద పక్కకి ఒత్తిగిలి ఒక చెయ్యి తల కింద పెట్టుకుని మళ్ళీ నిద్రకుపక్రమించాడు రాజిగాడు. వాడికి కొంచెం ఎడంగా సూర్యోదయానికి ముందే లేచి బందలో రాట చుట్టూ పచార్లు చేస్తోంది గేదె. రాత్రి బాగా చినుకులు పడ్డాయి. గుడిశ ముందు పందిర జల్లెడయి చాలా కాలమైంది. వర్షం, గేదె, పేడ, గడ్డీ కలిసిన వాసనలు. దుప్పటి జారిపోయిందేమో, రాజిగాడి చెవిమీద వాడిగా ఉంది ఎండ. నరసమ్మ గేదె కట్టు విప్పుతోంది. ఆనందంతో గేదె ఒక చిన్న అరుపు అరిచి తోక జాడించింది. కళ్ళు తెరవబోతున్న రాజిగాడి మొహంమీద బురద నీళ్ల పడ్డాయి. 'ఛూ' అంటూ ఒక్క ఉదుటున లేచి గేదెని కూడా అనరాని ఓ బూతు మాటతో దానివేపు కోపంగా చూశాడు.

నరసమ్మ గేదెని దూరంగా గోలెం వేపుకి లాక్కుపోయింది. రాజిగాడికి గేదెని వెంటనే అక్కడికక్కడే చంపెయ్యాలనిపించింది. 'ఛీ... ఛీ' అన్నాడు. 'పొద్దున్నే ఎదవ దరిద్రం'.

దిండుకింద చేత్తో వెదికి బీడీ అగ్గిపెట్టే తీసి వెలిగించాడు రాజిగాడు. గేదె వీపు నిమురుతూ కుడితి తాగిస్తోంది నరసమ్మ. అటు తిరిగి, మోచెయ్యి దిండు మీద ఆనించి ముక్కులోంచి పొగ వదులుతూ రోడ్డువేపు చూశాడు. మట్టిరోడ్డుకి ఇవతలగా ఉంది గుడిశ. రోడ్డు గుడిశ దాటిం తరువాత ఒంపు తిరిగి వెళ్లిపోతుంది. గుడిశ ఎదురుగా రోడ్డు అవతల రోడ్డుతో పాటు ఒంపు

తిరుగుతూ రెడ్డిగారి ఎత్తైన ప్రహరీగోడ. గోడనిండా ఖాళీ లేకుండా సినిమా పోస్టర్లు. రాజిగాడికి ఊళ్లో సినిమాలు ఏం మారాయో ('మీ అభిమాన థియేటర్లో') మంచం మీంచే తెలుస్తుంది.

బీడీ దమ్ములాగుతూ గోడవేపు చూసి ఒక్కసారి గతుక్కుమన్నాడు రాజిగాడు. పొగ గొంతులోకి పోయి ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు. రాత్రి కలలన్నీ గుర్తొచ్చేయి వాడికి. అలా చూస్తూ ఉండిపోయాడు. ఎదురుగుండా గోడమీద పెద్ద రంగుల వాల్‌పోస్టరు. వాడి పద్దెనిమిదేళ్ళ జీవితంలో అంత పెద్దదీ అంత అందమైనదీ మరో పోస్టరు చూళ్ళేదు.

నాలుగు భాగాల పోస్టరు నిన్న పొద్దుపోయిం తరువాత అంటిస్తూండగా చూశాడు రాజిగాడు. సగం బొమ్మ మాత్రం చూడగలిగాడు. అదసలు ఓ పెద్ద సబ్బుల కంపెనీ పోస్టరు. పోస్టర్‌లో రాజిగాడి గుడిశ కంటే పెద్ద తెల్లటి స్నానాల తొట్టి. తొట్టి పక్కనే స్టాండుమీద పెద్ద పూల తువ్వాలు. దాని ఇవతల గోడమీద పసుపు పచ్చని ట్రేమీద ఆకుపచ్చగా అప్పుడే ఏదో చెట్టుకి పూసిన పచ్చ పువ్వులా సబ్బుబిళ్ల. ఆమె తొట్టిలో స్నానం చేస్తోంది. కొంచెం ముందుకు వంగి సబ్బు అందుకునే ప్రయత్నంలో వుంది. తడిసిన ఆమె చెయ్యి మెరుస్తూ నిగనిగలాడుతోంది. వేళ్లు చుర్రుమన్నాయి రాజిగాడికి. బీడీ అవతల పారేసి మళ్ళీ చూశాడు. ముందుకి ఒంగుతూ ఆమె అరచేత్తో సన్నగా వంపు తిరిగిన ఆమె వక్షాన్ని కప్పుకోవడానికి వ్యర్థ ప్రయత్నం చేస్తోంది. వీపు తడిగా ఉంది. ఎరుపు జీర ఉన్న పాలరాతిలో చెక్కినట్టుందామె. నున్నటి బుగ్గలూ, ఎర్ర పెదాలూ, మృదువుగా నొక్కులు తిరిగిన జుట్టు. తడిగా నుదుటికి అతుక్కుపోయింది.

రాజిగాడికి కడుపులో ఇబ్బందిగా ఉంది. కళ్ళు నులుముకుని మళ్ళీ చూశాడు. స్నాన సుందరి సౌందర్యం ఉదయపు వెలుగులో స్వచ్ఛంగా తళతళలాడుతోంది. నిన్న సాయంకాలం నుంచీ స్నానం చేస్తోందేమో, అలల తాకిడికి నునుపు దేలిన శిల్పంలా ఉందామె. ఎంతసేపు చూసినా తనివి తీరడం లేదు. స్నానం అవగానే తువాలు కోసం లేచి నిలబడితే బావుండుననుకున్నాడు రాజిగాడు.

''టీ ఇత్తానింక లెగరా, ఇంచేపు నిద్రేటీ?'' నరసమ్మ కేక వాడికి సరిగా

వినబడలేదు. ''దురగమ్మ'' ఆరేళ్ల కొడుకు పనికట్టుకు ఒచ్చి పోస్టరు ముందు నిద్రకళ్లతో మూత్ర విసర్జన మొదలుపెట్టాడు. రాజిగాడికి చిర్రెత్తుకొచ్చింది.

''రేయ్-లేహె య్యెదవా'' గావు కేకతో ఉలిక్కిపడి వాడు తొడ తడిపేసుకుని ఏడుస్తూ పరిగెట్టాడు.

2

భద్రం దగ్గర టీ తాగి సైకిలెక్కాడు. స్టేషనవతల గడ్డి కోసుకుని మోపు సైకిలు మీదేసుకు రావాలి. రాజిగాడికివాళ వెళ్లాలని లేదు. ఏదో ఇదివరకు లేని బెంగగా వుంది. వాడికి సైకిలెక్కగానే పాటందుకునే వ్యసనం ఉంది. ముఖ్యంగా స్టేషన్ రోడ్డు దిగి పుంత రోడ్డు మలుపు తిరగ్గనే వాడు గొంతెత్తి 'పాట్లంకించు కుంటాడు'. గాలి మొహం మీద తగులుతూండగా, కొంచెం ముందుకి వంగి సైకిలు తొక్కుతూ అనర్గళంగా రాజిగాడు పాడుతుంటే పుంత నిశ్శబ్దం పటాపంచలవుతూంటుంది. కానీ వాడికివాళ పాట రావడం లేదు. గోడలు పరికించి చూశాడు. స్టేషనివతల మాత్రం వాడికి మళ్లీ స్నానసుందరి కనిపించింది. కింద పడ్డంత పనై నిలదొక్కుకున్నాడు.

గడ్డి కోస్తున్నంతసేపూ వాడి కళ్లముందు స్నానం చేసే అమ్మాయేు కనిపించింది. ఆకాశం నీలంగా అప్పుడే రంగేసినట్టుంది. దూరంగా మొలలోతు గడ్డిలోంచి పూల తువాలు కట్టుకు పరిగెడుతూ కనిపించిందామె. మోపు కట్టి సైకిలుకు తగిలించి తువాలుతో చెమట తుడుచుకుంటూ కూచున్నాడు రాజిగాడు. బీడీ వెలిగించి ముక్కులోంచి పొగ వదిలాడు. తువాలు చుట్టుకుని నెత్తిమీద గడ్డి మోపుతో కనిపించింది సుందరి. వెంటనే వాడికి ఆ ఆలోచనే అసహ్యం అనిపించింది. ఆమె నెత్తిమీద గడ్డిమోపు కాదు కదా గడ్డి పరక కూడా ఉండదు. కార్లో తిరుగుతూ తన మొహం కంటే శుభ్రంగా ఉండే పాదాలతో చల్లటి పాలరాతి గచ్చుమీద నడుస్తుందామె. ఈ సినిమా 'య్యాక్టర్లం'దరూ దానిముందు దిగదిడుపే. రాజిగాడు చాలా సినిమాల్లో అగ్గిపెట్టెలు, దుప్పట్లు, సిగరెట్లు, సబ్బుల మీదుండే అమ్మాయిల్ని చూశాడు. ఎవరూ సుందరి అంత అందంగా, ఈ లోకానికి చెందినట్లుగా లేదు. ఆమెంకి 'పెళ్లిగట్రా' అయింటుందా? బీడీ ఆవతల పారేసి, సుందరి ఉదయం నుంచి సాయంత్రం

వరకు ఏం చేస్తూంటుందో ఊహించడానికి ప్రయత్నించాడు. అసలావెమ మామూలు మానవమాత్రుల కాలకృత్యాలు కూడా తీర్చుకుంటుందా అనిపించింది. పాలు తియ్యదు, గేదెలు కడగదు. అమ్మలాగ 'రెండ్రోజులకోపాలి' స్నానం చెయ్యదు. ఎంత ఆలోచించినా సుందరి సాధారణ స్త్రీ అనిపించడం లేదు. ఆమెని 'సచ్చేలోపుల ఓ పాలేనా' చూడాలి. మద్రాసులో, బొంబాయిలో సినిమా తారలు రోడ్డుమీద నుంచుంటే కనిపిస్తారని చెప్పేడు భద్రం. అతనలాగే చూశాట్ట ఓసారి.

సైకిలుమీద ఇంటికెలా వచ్చేడో వాడికే తెలీదు. పందిరి రాటకి సైకిలానించి తువాలుతో చెమట తుడుచుకుంటూ నుంచున్నాడు. తలుపు తడిక లాగి ఉంది. నరసమ్మ లేదు. గేదె నెమరు వేస్తూ ఆలోచనలో ఉంది. తడిక తోశాడు. గుడిశ గుడ్డి కన్నులా ఉంది. మంచంమీద వాల్చుకు కూర్చున్నాడు రాజిగాడు. గేదె వాణ్ణి చూసి అరిచింది. కాసేపు సుందరిని చూశాడు. కొంచెం ఆకలిగా ఉంది (అన్నంలో ఏవేసుకుంటుందో).

లేచి కాళ్ళూ చేతులూ కడుక్కుని అన్నం ముందు కూచున్నాడు. చల్లటి అన్నం నాలుగు ముద్దలు తినగానే తినాలనిపించలేదు వాడికి. కంచం తోసేసి లేచాడు.

'సీ దరిద్దరం'

కాలితో గేదెనోతాపు తన్ని నులక మంచంమీద కూచుని బీడీ వెలిగించాడు రాజిగాడు.

## 3

రాజిగాడికి సంవత్సరం తిరక్కుండానే తీసుకొచ్చేసింది నరసమ్మ. ఎలా పెరిగాడో వాడికీ, ఎలా పెంచిందో ఆమెకీ తెలీదు. ఆమె ఆరోగ్యం, యవ్వనం వాణ్ణి ఆదుకున్నాయి. నరసమ్మని పోలయ్య ఆదుకున్నాడు. ఓ మగదిక్కూ, గుడిశా, గేదే, రెండు నులకమంచాలూ ప్రసాదించాడు పోలయ్య. రాత్రిళ్ళు పోలయ్య వెళ్ళగానే సొంత ఊరు జ్ఞాపకం వచ్చేది. పిల్లాణ్ని దగ్గరిగా తీసుకు పడుకునేది నరసమ్మ.

నరసమ్మకి పెళ్లయిన నాలుగేళ్ళ వరకూ పిల్లలు పుట్టలేదు. తంబూరా, ఎర్ర గుడ్డలూ, గడ్డం ఉన్న ప్రతివాడికీ మొక్కిందామె. రాజిగాడు పుట్టిన వారంలోనే నరసమ్మ బాబు చచ్చిపోయాడు. చామన చాయలో దుక్కలా ఉన్న కొడుకుని చూసుకుని నరసమ్మ మొగుడు సంబరపడిపోయాడు. ('ఎదవ నాలాగే అయి మూలగా నవ్వుతున్నాడేటే?')

నరసమ్మ మొగుడికి కొడుకు జాతకం వేయించాలనిపించింది. వాడు పుట్టిన తేదీ రాయించుకుని, నీరసంగా ఇంటికి తిరిగొచ్చాడు. నేలమీద చతికిలబడి ఏడుపు గొంతుతో అన్నాడు.

''అదిగాదే. ఈడు పుట్టిన కాలం, మూర్తం మంచిది కాదంట. ఆడికి ఏడాది తిరగ్గానే ఆడి బాబుకి గండం ఉండదంట'' నరసమ్మ గుండె తెగి కడుపులో పడింది.

''ఓలమ్మో నా తాడు గట్టిది. అన్నారం సత్తినారాయణకి మొక్కుకున్నాను. ఏం బయం లేదు''

''తప్పదంటే. నే బోవాల్సిందే. నీ తాడు కట్టించే వాడూ తెంపేవోడూ దేవుడేనే''

నరసమ్మ పెద్దగా ఏడుస్తూ పిల్లాణ్ణి గుండెకదుముకుంది.

''ఆడు బతికుంటే నేసావడం కాయం. రాట్లాటి మీ బాబు పోలా. అదీ జెప్పేడు. నీ తాడు గోదాట్లో కలిసిపోద్దీ. అదీ నా మాటిను. రేపు రాత్రి ఈణ్ణి దీసుకుని రాయుమంత్రం ఎల్తాను. రైలుకాడో పెద్దాసుపత్రికాడో జార్తగా ఒదిలీసొచ్చేద్దాం. నే బతికుంటే ఈడిలాటోళ్లు ఆరుగురు''

నరసమ్మ నేలమీద పడి దొర్లింది. ''సత్తినారాయణ సల్లగా'' చూడకపోడంది. ''పిల్లోణ్ణి కాటలూ కుక్కలూ సంపేత్తా''యంది. ''నీకు ప్రేనం ఎలాగొప్పుదయ్యా''

''సరే... నీ తాడు గోదాట్లో ఇప్పుడే గలిపెయ్యి'' పంచ ప్రాణాలూ అరచేతిలో, బొడ్లో అయిదు రూపాయలతో పిల్లాణ్ణి చంకనేసుకుని ఎవరూ

చూడకుండా బస్సెక్కేసింది నరసమ్మ. పిల్లాణ్ణి వొదిలేస్తానన్న పెద్దాసుపత్రి దగ్గరే పోలయ్య కలిశాడు. ఎన్నేళ్ళయినా నరసమ్మ కెప్పుడూ మొగుణ్ణి చూడాలనే ఉంటుంది. (ఈ ప్రేమ ఆడి చేతిలో బోవాల్సింది)

సాయంకాలం వాడుక పాలు పోసొచ్చేడు రాజిగాడు. గేదెని కడగమంది నరసమ్మ. సర్రున కోపం వచ్చింది వాడికి.

''ఓపిక లేదురా. కాళ్ళు లాగేస్తున్నాయి.. సచ్చి నీ కడుపున పుడతాను''

''సాల్లే బతికుండి సంపుకు తింటున్నావు. ఇంక సచ్చి మళ్లీ అదోటా. ఎదవ పీడ్రా బాబూ'' కరిగిపోతున్న చిన్న గడ్డి మేట్లోంచి పడికెడు పరకలు లాగి ఉండగా చుట్టి, ఒక్క తాపుతో గేదెని లేపి కడగడం మొదలెట్టాడు రాజిగాడు. హాయిగా నీళ్ళు పోయించుకుంటున్న గేదె వాడికా క్షణంలో శత్రువులా, నాలుగు కాళ్లున్న తన 'దరిద్దరం'లా గనిపించింది. గోలెం ఖాళీగా ఉంది. 'లంజికనా... గోలెం కుడితీ టీ అనుకున్నావేటీ' గేదెని కడుగుతున్నంతసేపూ వాడికి తన దౌర్భాగ్యం మీద అసహ్యం వేసింది. బతుకంతా వాడుకపాలు ఇవ్వడం, గేదెని కడగడం మినహా ఏవీ కనిపించడం లేదు. అనుకోకుండా రాజిగాడికి తనేదో సంకుచితమైన జీవన చక్రంలో గిరగిర తిరుగుతున్నట్టనిపించింది. వాడికి జీవితంమీద ప్రత్యేకించి ఊహలు ఉండేవి కావు. భద్రం చెప్పినట్టు చిన్న కిళ్లీ కొట్టు పెట్టుకుని వీలైనన్ని ఎక్కువ సినిమాలు చూడ్డమే భవిష్యత్తు. వాడి ప్రపంచంనిండా గేదె వాసనలు, భద్రం టీ రుచులు. 'అతను తరచుగా చెప్పే బూతు కబుర్లూ'.

కాళ్ళూ మొహం కడుక్కుని చొక్కా తగిలించుకుని బయలుదేరాడు రాజిగాడు.

''ఏడికిరా?''

''భద్రం కొట్టుకి''

''ఆ ఎదవ బీడీలు కాల్చకరా. గుండె లార్చుకుపోతయి''

''ఏమవదులేవే''

''ప్రేనం బావోలేదు. కాత్తంత టీ నీళ్ళు బిల్లా తే అయ్యా''

''సర్లే''

''కాత్తంత దీపం ఎలిగించు''

రావి చెట్టుకింద భద్రం టీకొట్టు సందడిగా లేదు. రెండు కాళ్ళూ బెంచీమీద పెట్టి, మోకాళ్ళ మీంచి చేతులు ఒదిలేసి కూచున్నాడు రాజిగాడు.

''ఏరా బామర్దీ రాత్రి ప్రోగ్రాం ఉంది ఒత్తావేటీ?'' బామర్ది తల అడ్డంగా ఊపాడు. వాడికిప్పుడు సినిమా మీద మనసు లేదు. టీ చప్పరిస్తూ మెల్లిగా అడిగాడు రాజిగాడు.

''మా ఇంటికాడ తానం జేసే అమ్మాయి ఫోటో జూసేవా?''

కుంపటి ఎర్రగా మండుతోంది. భద్రం నల్లటి గడ్డంలోంచి నవ్వేడు. పళ్లు పచ్చగా మెరిసేయి.

''గొప్పగుందిలే''

''అది పాటో అంటావా?''

భద్రం బోధి వృక్షం కింద బుద్ధుడిలా రాజిగాడి అజ్ఞానాన్ని పటాపంచలు చేశాడు.

''బొమ్మగాదురా బామ్మర్దీ. ఆళ్లకి బోల్డు డబ్బూ గట్రా ఇచ్చి అలా ఫోటోలు దీస్తారు''

''ఏటీ ఒంటిమీద...''

''ఆ మరదే. ఆ యమ్మిని జూసి మనలాటెర్రెదవలు సబ్బులు గొంటారు. రేత్రి నిద్దరగాని పట్లేదేటి?''

''ఛ ఛ''

తరువాత భద్రం సుందరీ వాళ్ళ ఖరీదైన జీవితం గురించీ కార్ల గురించీ, డబ్బు గురించీ చెప్పేడు. రాజిగాడి కళ్ళు పెద్దవయ్యాయి. గుండె వేగంగా కొట్టుకుంది.

అంతా విని బీడీ వెలిగించి అన్నాడు.

''ఒరే మన్దీ ఓ బతుకే''

మరి కాసేపు కూచుని టీ తీసుకుని ఇంటికెళ్ళేడు రాజిగాడు. గుడిశలో దీపం సన్నటి పొగ కక్కుతోంది. మంచంమీద ముడుచుకు పడుకుంది నరసమ్మ.

''ఏటి జరవా?''

''అలాగే ఉంది. పాలు నువ్వే తియ్యాలి''

రాజిగాడికి పట్టలేనంత కోపం వచ్చి గుడిశకి అగ్గిపుల్ల గీసి నిప్పంటించాలనిపించింది. రాత్రి నరసమ్మ అన్నం తినలేదు. ఉడికించిన గుడ్డు కొరుక్కుంటూ ఆలోచనల్లో పడ్డాడు. వాడికి గుడిశలో కొత్త చీకట్లు కనిపిస్తున్నాయి. దీపం చీకటిని స్పష్టంగా చూపిస్తోంది. చీకటి నీడలో నరసమ్మ బొమ్మ గీసినట్టుంది.

మంచంమీద పడుకుని, చీకట్లో స్నానం చేస్తున్న సుందరిని చూస్తూ బీడీ వెలిగించేడు రాజిగాడు. పోస్టరు రంగులు అస్పష్టంగా కనిపిస్తున్నాయి. తెల్లటి స్నానపు తొట్టి తెలుస్తోంది. చటుక్కున లేచి ఆమె చీకట్లో ఒళ్ళు తుడుచుకుంటోంది. కళ్ళు చికిలించి చూశాడు రాజిగాడు. చీకటి ఆకాశంలో నక్షత్రాలు ఒణుకుతున్నాయి. గాలి బాగా చల్లబడింది. రాజిగాడికి చక్కిలిగింతలు కలిగాయి. మంచంమీద ఎవరో కూచున్నారు. ఒళ్లు వెచ్చగా మెత్తగా తగులుతోంది. దుప్పటి కిందనుంచి ఆమె వాడి గుండెలమీద సుతారంగా రాస్తోంది. చీకట్లో ఆమె సగం తెల్లగా కనిపించింది. రాజిగాడి శరీరం వెచ్చగా దహించుకుపోతోంది. చేతులు ఆమె భుజంమీద వేశాడు. తల వంచి గట్టిగా ఆమె పెదాలు ముద్దు పెట్టుకున్నాడు. మెడ వెచ్చగా తియ్యగా ఉంది. ఆమె లేచి వాడికి చెయ్యి అందించి మెల్లిగా గదిలోకి నడిపించింది. గదిలో నీలపు దీపం పూసింది. తెల్లటి మబ్బులతో చేసిన పరుపు. రాజిగాడు అందులో కూరుకుపోయేడు. మంచం దగ్గిర నుంచుని ఆమె నవ్వింది. వాడివేపే చూస్తూ పూల తువాలు తీసేసిందామె. పక్కనే పడుకుని వాణ్ణి దగ్గరికి తీసుకుంది. ఆమె వాడిన సబ్బు పరిమళాలు ఆమె శరీరంలో నరాలూ, రక్తనాళాలూ పూయించిన

వింత పూల వాసనలో రాజిగాడు ఏదో సుగంధ సముద్రంలో పడి ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు. మెలకువ వచ్చి గేదె అరిచింది.

## 4

రాజిగాడి ప్రపంచం రంగులు మారిపోయింది. వాణ్ణి చీకట్లు తరుము తున్నట్టూ, గేదె మీద కూచుని నరసమ్మ వాడిని వెంటాడుతున్నట్టూ అనిపిస్తోంది. రంగుల పోస్టరు వాడి జీవితాన్నీ కోరికల్నీ ఆక్రమించింది. రాజిగాడి జీవితానికి పోస్టరు మాయ తివాచీ అయిపోయింది. ఓరోజు సాయంత్రం తెల్లటి స్నానపు తొట్టిమీద ఎవరో చిన్న పేడ ముద్ద వేశారు.

'లంజి కొడుకులు'

చిన్న వెదురుకర్ర తీసుకుని జాగ్రత్తగా పేడ ముద్దని తీసి పోస్టరు శుభ్రం చేశాడు రాజిగాడు. రెండు మెతుకులు తిని పందిరి కింద మంచం వేసుకుని సుందరికి కాపలా కాయడం వాడి దినచర్య అయిపోయింది. తిరిగే చక్రం నుంచి రూపం మారి విడిపోయే వస్తువులా వాడి జీవితం నుంచి రాజిగాడు వేరుపడ్డాడు. ఆలోచించిన కొద్దీ వాడిలో ఏదో కొత్త ఊహలూ, ఆశలూ మొలకలెత్తేయి. పద్దెనిమిదేళ్ళ జీవితం వాడి ఒంటికి అంటుకుపోయిన మురికి చొక్కాలా కనిపిస్తోంది రాజిగాడికి.

నరసమ్మకి ఎందుకో జ్వరం తీవ్రమైంది. పాలు తియ్యడం, గడ్డికెళ్ళడం, వాడుకపాలు పొయ్యడం రాజిగాడికి తప్పలేదు. ఇవేవీ వాడికి కొత్త కాకపోయినా, ఇప్పుడవన్నీ ఏవగింపుగా ఉన్నాయి. హఠాత్తుగా వాడికి జీవితం ఎంత గేదె వాసనభరితమైందో అర్ధమై, ఇదివరకెన్నడూ లేని ద్వేషం ఏర్పడింది.

మధ్యాహ్నం నరసమ్మకి బిళ్ళా, టీ ఇచ్చి బీడీ వెలిగించి కూచున్నాడు రాజిగాడు. లోపల లేత చీకట్లో నరసమ్మ మూలుగుతోంది. నాలుగైపోతోంది. మంచం దిగబోతుండగా సందు మలుపు తిరుగుతున్న స్కూటర్ శబ్దం వినబడింది. రెడ్డిగారబ్బాయి నోట్లో సిగరెట్ వెలుగుతోంది. ఎడం చేత్తో సిగరెట్ తీసి సరిగ్గా సుందరి తడి భుజం మీదికి విసిరేశాడు.

''యెదవ. ఏ లారీకో గుద్దేత్తే సరిపోద్ది''

చెంబునిండా పాలు తీసుకుని మెళ్ళో తువాలు వేసుకుని బయల్దుదేరాడు రాజిగాడు. పాలు పోయించుకుంటూ అడిగిందామె.

''ఏరా మీ అమ్మ రావడం లేదేం?''

''జరవండి ముండకి'' క్లుప్తంగా జవాబిచ్చాడు.

''అవ్వ దాన్ని ముండారండా అనొచ్చు(రా కళ్ళోతాయి''

''ఏవవ్వండి. ఇంకా బావుంటాయి. మా యమ్మండీ దొంగ మొకందండి. దాన్నేవన్నా తప్పు లేదండి. మీకు పాలు పోసుద్దాండి, సకానికి సకం నీళ్ళండి. మీరడగండి. గొళ్ళకి గడ్డిలేదు. తాడు లేదని ఏడుస్తదండి, అంతా అబద్ధవేనండి. డబ్బు కక్కుర్తండి. డబ్బంతా మూటల్లు గట్టేసి సచ్చేటప్పుడు కట్టుకుపోదామని దాని అయిడియా అండమ్మగారూ. నేనున్నానండీ దాని కొక్కణ్ణి కొడుకునండి. కదండమ్మగారూ! ఒక్క పాలి కూడా ఒరే సర్దాగా ఈ అయిదూ పట్టుకుపోయి సినిమాకెళ్ళి తిరిగి రారా అందండి. ముండికి నో(రాదండి. నేనండమ్మగారూ పెద్ద టేషనవతల కెళ్ళాలండి గడ్డికి. కోసేటప్పుడండీ సేతులు తెగిపోతాయండి. అంతా బురద, గత్తర. ఆణ్ణించి మోసేసుకు రావాలండి. రాగానే నా మొగాన ఎదవ టీ నీళ్ళు పోస్తదండి. కాత్తంత టిఫినిస్తే ఏం పోద్దండమ్మగారూ. రాగానే గొడ్డు గడగాలంటదండి. ఈ లాగు చూడండి సిరిగి నాలికలైపోతే కుట్టుకున్నానండి. అదే ఏ సిన్న నౌకరీ జేసినా నాకీ ఎదవ ముండా గొడవ వుండకపోనండి. ఉజ్జోగం లేదండి, తిండి లేదండీ. డబ్బు లేదండి. అదండి ఇంకో టెరుగుదురా, నోరిప్పకముందే ఏడుపు లంకించుకుంటుంది. ఏడుపే ఏడుపే ఏడుపు. ముండకండీ నెత్తిమీద సిల్లుకుండ ఉంటదండి. ఒస్తానండి''

''మొన్నటి వరకూ బాగానే ఉన్నావు గదరా''

5

చీకటితోపాటు మబ్బు పట్టింది. కొంచెం గాలి కూడా మొదలైంది. చలికి కాయితం ఉండలా ముడుచుకుపోయింది నరసమ్మ. జ్వరం తగ్గలేదు. ఎక్కడో

పెద్ద మెరుపు మెరిసింది. ఒక్కసారి చల్లటి గాలితోపాటు, ఆకాశం చీరుకుపోయి పెద్ద వర్షం మొదలైంది. గుడిశ తలుపు తడిక గజగజలాడుతోంది. రోడ్డుమీంచి నీళ్ళు కాలవలై నల్లపాముల్లాగా కిందికి జారుతున్నాయి. రాజిగాడు ఇంకా రాలేదు. నరసమ్మ అరిగిపోయిన శరీరంలో రక్తం వరదలై పారుతోంది. అంత జ్వరంలోనూ ఆమెకి కొడుకు పెళ్ళి చెయ్యకుండానే 'బగవంతుడు' తీసికెళ్ళిపోతాడేమోనని భయమేసింది. మంచు పిడికిట్లో పిసికినట్టయింది గుండె. తన పక్కనే మంచంమీద 'అసలే ఎర్రెదవ' కూచున్నట్టయింది. ఒంటినిండా దుప్పటి కప్పుకుని మూలుగుతూ లేచింది నరసమ్మ. తలకింద తలగడాలో దూదిలో కూరుకుపోయిన చిన్న మూట తీసింది. దీపం దగ్గరగా జరిగి, రెండు తెగిపోయిన సన్నటి గొలుసులూ, పల్చటి మంగళసూత్రం, రెండు గాజుల్నీ జాగ్రత్తగా తాకి చూసుకుందామె. దీపం వెలుగులో, ఆమె జీవితం కంటే ఖరీదైన బంగారం చల్లగా పచ్చగా కనిపించింది. చేతుల్లోకి తీసుకుని అలాగే చూస్తూ ఉండిపోయింది నరసమ్మ.

సాయంత్రం 'ప్రోగ్రాం' వేశాడు భద్రం. చీకటి పడగానే భద్రం గదికి వెళ్లిపోయాడు రాజిగాడు. అప్పటికే భద్రం ప్రోగ్రాం ప్రారంభించాడు. పకోడీ పొట్లం విప్పి రాజిగాడికి గ్లాసు అందించాడు. వాడెప్పుడూ తాగలేదు. కానీ ఓ అరగంట కల్లా భద్రం ప్రోగాం వాడికి బాగా నచ్చింది. ('ఒరే బావమర్దీ కిక్కిచ్చేత్తదో ఏటో నీకు') కడుపులో వెచ్చగా ఉంది రాజిగాడికి. మెల్లిగా సంభాషణ సినిమాల మీదికి మళ్లింది. భద్రం వాడికి సినిమా తారల గురించీ, సుందరి లాంటి అప్సరసల గురించీ చెప్పడం మొదలుపెట్టాడు. మరో అరగంటకి రాజిగాడు స్థలకాలాలను ఒదిలేసి తారల వెంట విహరించడం ప్రారంభించాడు. గేదె, గుడిశల వాసనల నుంచి వాడి పరిమళ భరితమైన రంగుల ప్రపంచంలో తేలిపోతున్నాడు. భద్రం చెప్పుకుపోతున్నాడు.

'మెడ్రాసెల్దావేటి బావా?'

పొరబోయేదాకా నవ్వేడు భద్రం.

'ఏటీ నీ కాకీ నిక్కరూ, నీలం నిక్కరూ సరిపోద్దనుకున్నావేటీ? సుబ్రవైన బట్టల్లేకపోతే సీ అంటారెరుగుదువా? ఓటల్లోకి గూడా రానివ్వరొరే. ఇంక నీకు

సొల్లేరా బామర్దీ. పద''

తూలుకుంటూ ఇంటివేపు నడిచేడు రాజిగాడు. వర్షంలో దూదిలా నానిపోయేడు. మలుపులో ఓసారి ఆగి గోడవేపు చూశాడు. సుందరికి ఇంకా సబ్బు అందలేదు. వర్షంలో తడిసిపోతోంది. తలుపు తడిక దగ్గర నుంచుని సందులోంచి చూశాడు రాజిగాడు. రాటకి తలానించి చేతులో గొలుసులతో కనిపించింది నరసమ్మ. కళ్ళు నులుముకుని చూశాడు రాజిగాడు. వాడి గుండె జారి కడుపులో ఉన్న రమ్ములో పడింది. బంగారవే!

పెద జల్లుతో పాటు తలుపు తోసుకుని వచ్చేడు రాజిగాడు. నరసమ్మ చేతిలో బంగారం వాణ్ణి మంత్రించింది. మొహం పెనంలా వేడిగా ఉంది. జుట్టులోంచి నీరు సన్నగా మొగం మీదికి కారుతోంది. వాణ్ణి చూడగానే నరసమ్మకి భయమేసింది. ఏదో అనబోయి నోట మాట రాలేదు.

''కంతిరీ ముండా, కూడెట్టకుండా కట్టుకుపోదామని బంగారం దాసేవా?''

ఎండిపోయిన ఆమె చేతిలోంచి ఒక్క ఊపుతో గొలుసు లాక్కుని, మరో చేత్తో నరసమ్మని పుచ్చిపోయిన కొయ్యబొమ్మలా మంచంమీదికి విసిరేశాడు రాజిగాడు. మంచం కోడు తలకి తగిలి కెవ్వుమంది నరసమ్మ.

తూలుకుంటూ వర్షంలోకి పరిగెట్టాడు రాజిగాడు.

*